సాక్షి నిర్మల్

మంగళవారం । 23 । మే । 2023



క్రీడల్లో మెరిసేలా..

ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల్లోని గిరి విద్యార్థులు జాతీయ, రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో ప్రతిభ కనబర్చేలా ఐటీడీఏ ఆధ్వర్యంలో వేసవి క్రీడాశిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నారు.

8లో▸



సీడ్‌బాల్స్ తయారీ

కడెం: మండలంలోని కొత్తమద్దిపడగ అటవీ నర్సరీలో అంగన్‌వాడీ చిన్నారులతో సీడ్‌బాల్స్ తయారీ కార్యక్రమాన్ని సోమవారం డీఆర్డీవో విజయలక్ష్మి ప్రారంభించారు. ఎఫ్ఆర్వో అనిత, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, ఏపీవో జయదేవ్, ఐసీడీఎస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
41.0 /29.0

ఆకాశంలో కొంతమేర మబ్బులు ఉంటాయి. ఎండతీవ్రత కొనసాగుతుంది. ఉక్కపోత, వేడి అధికంగా ఉంటుంది. వడగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

దరఖాస్తుల ఆహ్వానం

నిర్మల్‌చైన్‌గేట్: 2023–24 విద్యాసంవత్సరానికి కార్పొరేట్ కళాశాలల్లో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధిశాఖ అధికారి వీ.రాజేశ్వర్‌గౌడ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాకు చెందిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, దివ్యాంగ విద్యార్థులు ఈ నెల 22 నుంచి జూన్ 3 వరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, వసతిగృహాల్లో చదివి, పదో తరగతిలో 7.0 జీపీఏ, ఆపైన మార్కులు సాధించిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు.

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో జిల్లా నాయకులు



బండి సంజయ్‌తో జిల్లా నాయకులు

నిర్మల్‌చైన్‌గేట్: హైదరాబాద్‌లోని చంపాపేట్‌లో గల సామ సరస్వతి కన్వెన్షన్ హాల్ సోమవారం బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ అధ్యక్షతన నిర్వహించిన పార్టీ రాష్ట్ర కార్యవర్గ సమావేశానికి జిల్లా నాయకులు హాజరయ్యారు. సమావేశంలో నిర్మల్ జిల్లాకు సంబంధించిన పలు అంశాలపై చర్చించినట్లు జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ పడకండి రమాదేవి తెలిపారు. సమావేశంలో జిల్లా సహా ఇన్‌చార్జి మ్యాన మహేష్, మాజీ ఎంపీ రాథోడ్ రమేష్, రావుల రాంనాథ్, జిల్లా ప్రధాన కార్యదర్శులు సామ రాజేశ్వర్ రెడ్డి, మెడిసెమ్మె రాజు, పెంబి జెడ్పీటీసీ జానుబాయి, రామారావు పటేల్, రవి పాండే, నారాయణరెడ్డి, భోజారెడ్డి పాల్గొన్నారు.

యాదవ మహాసభ జిల్లా అధ్యక్షుడిగా శంకర్



నిర్మల్‌టౌన్: అఖిల భారత యాదవ మహాసభ జిల్లా అధ్యక్షుడిగా కర్రోళ్ల శంకర్ యాదవ్‌ను నియమించినట్లు యాదవ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు మిరుగు బా బుయాదవ్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని మంజులాపూర్ కాలనీకి చెందిన శంకర్ కౌన్సిలర్‌గా యాదవుల అభివృద్ధికి పాటుపడుతున్నారు.

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- ఎమ్మెల్సీ గంగాధర్‌గౌడ్



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ గంగాధర్‌గౌడ్

కడెం(ఖానాపూర్): బీఆర్ఎస్ ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఎమ్మెల్సీ గంగాధర్‌గౌడ్ అన్నారు. సోమవారం మండలంలోని కొండుకూర్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్సీ మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఎమ్మెల్యే రేఖానాయక్ మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ టికెట్ తనకే వస్తుందని, గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాజేందర్, జెడ్పీ కోఆప్షన్ మెంబర్ రఫీక్ అహ్మద్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్, రైతు సమన్వయ సమితి మండల కన్వీనర్ జీవన్‌రెడ్డి, వైస్ ఎంపీపీ శ్యాంసుందర్, సర్పంచ్‌ల ఫోరం మండలాధ్యక్షుడు వేణుగోపాల్, సర్పంచ్‌లు రాజిరెడ్డి, గంగన్న, రంభదేవి, తదితరులు పాల్గొన్నారు.

'కడెం' మరమ్మతులు పరిశీలన

కడెం(ఖానాపూర్): కడెం ప్రాజెక్ట్ మరమ్మతు పనులను సోమవారం ఈఎన్‌సీ బృందం పరిశీలించింది. గతేడాది వచ్చిన భారీ వరదలతో దెబ్బతిన్న ప్రాజెక్ట్ 2, 3 నంబర్ల వరదగేటు కౌంటర్ వెయిట్‌ల స్థానంలో బిగించేందుకు నూతనంగా తయారు చేస్తున్న కౌంటర్ వెయిట్‌లను పరిశీలించారు. కార్యక్రమంలో ఆదిలాబాద్ సీఈ శ్రీనివాస్, డిజైనింగ్ ఎక్స్‌పర్ట్స్ క్రిష్ణ, సంజీవ్, ఎస్ఈ సుశీల్‌కుమార్, డీఈ భోజదాసు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రాజెక్టులు పటిష్టం..!

- గతేడాది అనుభవాలతో మరమ్మతులు
- ఎంత వరద వచ్చినా మెయింటనెన్స్ చేసేలా చర్యలు
- ధ్వంసమైన కాలువలకు మరమ్మతు

జిల్లాలో సాగునీటి ప్రాజెక్టుల పటిష్టతపై ప్రభుత్వం దృష్టి సారించింది. గతేడాది కురిసిన భారీ వర్షాలకు రికార్డుస్థాయిలో వరద పోటెత్తింది. సాంకేతిక సమస్యలతో కడెం ప్రాజెక్టు వరదను మెయింటేన్ చేయలేక అధికారులు చేతులెత్తేశారు. దీంతో ప్రాజెక్టు కొట్టుకుపోతుందా అన్న ఆందోళన వ్యక్తమైంది. మరోవైపు భారీ వరదలకు గేట్లు, కాలువలు దెబ్బతిన్నాయి. ఈనేపథ్యంలో వచ్చే వర్షాకాలంలో ఇలాంటి పరిస్థితి పునరావృతం కాకుండా కలెక్టర్ వరుణ్‌రెడ్డి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. ఈ క్రమంలో గత వానాకాలంలో దెబ్బతిన్న ప్రాజెక్టుల మరమ్మతు పనులు వేగవంతం చేయించారు. ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తున్నారు. మరో నెల రోజుల్లో పూర్తయ్యేలా నీటిపారుదల శాఖ అధికారులను పరుగులు పెట్టిస్తున్నారు. అయినా కొన్ని పనులు నత్తనడకన సాగుతున్నాయి.



సదర్మాట్‌లో దెబ్బతిన్న గైడ్‌వాల్

'కడెం' మెయింటనెన్స్ పనులు



గ్రీసింగ్, మరమ్మతు పనులు చేస్తున్న సిబ్బంది

కడెం: వానాకాలం సీజన్‌కు కడెం ప్రాజెక్ట్ మరమ్మతు పనులు కొనసాగుతున్నాయి. ఇందుకోసం నీటిపారుదల శాఖ రూ.8 లక్షలు కేటాయించింది. వీటితో గ్రీసింగ్, జనరేటర్ మెయింటనెన్స్, డీజిల్, ఆయిలింగ్, క్లీనింగ్ తదితర మరమ్మతు పనులను చేస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు. గతేడాది ప్రాజెక్ట్‌కు వచ్చిన భారీ వరదల కారణంగా 2, 3వ నంబర్ వరద గేటు కౌంటర్(వరద గేటు ఎత్తేందుకు సహాయపడే భారీ దిమ్మె) వెయిట్‌లు విరిగి కింద పడ్డ విషయం తెలిసిందే. వాటి స్థానంలో నూతన కౌంటర్ వెయిట్‌లను తయారు చేయించారు. త్వరలోనే అకౌంటర్ వెయిట్‌లను రెండు వరద గేట్లకు అనుసంధానంగా చేయనున్నారు. అయితే ప్రతిపాదనలు పంపినా దెబ్బతిన్న వరద గేట్ల కౌంటర్ వెయిట్‌లకు ఎలాంటి బడ్జెట్ విడుదల కాలేదని అధికారులు తెలిపారు. మెయింటనెన్స్ పనులు జూన్ 10 లోగా పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు డీఈ భోజదాసు పేర్కొన్నారు.



కడెం ప్రాజెక్టు

నత్తనడకన సదర్మాట్ మరమ్మతులు

ఖానాపూర్: ఖానాపూర్, కడెం మండలాల రైతుల జీవనాధారం సదర్మాట్ ఆయకట్టు రైతులు ఏళ్లుగా సమస్యలతోనే సతమతమవుతున్నారు. రెండు మండలాల పరిధిలో అనధికారికంగా 20 వేల ఎకరాలకు, అధికారికంగా 13,120 ఎకరాలకు సాగునీటిని అందిస్తారు. కాలువ పరిధిలోని పలుచోట్ల తరచూ సమస్యలు తలెత్తుతున్నాయి. దీంతో చివరి ఆయకట్టుకు నీరందడం లేదు.

వానాకాలంలో తప్పని తిప్పలు

వానాకాలంలో అధిక వర్షాల కారణంగా మండలంలోని పాత ఎల్లాపూర్ వద్ద అక్విడేట్ కొట్టుకుపోయి ఖరీఫ్‌లో కడెం మండలానికి సాగునీరందలేదు. దీంతో అనేకమంది రైతులు పంటలు సాగుచేయకుండా భూములను బీడుగా వదిలేశారు. అనంతరం యాసంగిలో సాగునీటిని అందించాలనే ఉద్దేశంతో రూ.15 లక్షలతో తాత్కాలిక మరమ్మతు పనులు చేపట్టినప్పటికీ సక్రమంగా చేయక నీరంతా వృథాగా పోయింది.

ప్రారంభమైన శాశ్వత నిర్మాణ పనులు..

కాలువ దెబ్బతిన్న ప్రాంతంలో శాశ్వత అక్విడేట్ పనులకు రూ.5 కోట్లతో ఇటీవల పనులు ప్రారంభించారు. పక్షం రోజులుగా పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఈ పనులు ఖరీఫ్‌కు ముందే పూర్తవ్వాల్సి ఉంది. పనులు ఆలస్యం అయితే రైతులకు వానాకాలం సాగునీరందే పరిస్థితి ఉండదు.

దెబ్బతిన్న గైడ్‌వాల్..

మండలంలోని సదర్‌మాట్ ఆనకట్ట ప్రాంతంలో గైడ్‌వాల్ దెబ్బతిని నీరంతా గోదావరిలోకి వృథాగా పోయింది. అధికారులు తాత్కాలిక మరమ్మతులు చేశారు. శాశ్వత మరమ్మతు పనులు చేపట్టాల్సి ఉంది. శాశ్వత నిర్మాణ పనులను ప్రారంభిస్తామని డీఈ సురేందర్ తెలిపారు.

'స్వర్ణ' మధ్యకాలువకు మోక్షం

సారంగపూర్: మండలంలోని స్వర్ణ ప్రాజెక్టు మధ్యకాలువకు ఎట్టకేలకు మోక్షం లభించింది. ప్రాజెక్టు మధ్యకాలువ(జౌళినాలా) మరమ్మతులకు ప్రభుత్వం నిధులు విడుదల చేయడంతో అధికారులు పనులు ప్రారంభించారు. ప్రాజెక్టు మరమ్మతు పనుల్లో భాగంగా ఇటీవల ప్రాజెక్టులోని మొత్తం నీటిని స్వర్ణ నదిలోకి విడుదల చేస్తున్నారు. నీరు ఖాళీ చేయడంతోపాటు పనులను చేపట్టేందుకు ప్రణాళిక రూపొందించారు. ఈనేపథ్యంలో ప్రాజెక్టు పరిస్థితిని పరిశీలించేందుకు గాను జిల్లా కలెక్టర్ వరుణ్‌రెడ్డి గురువారం ప్రాజెక్టును పరిశీలించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

15 ఏళ్లుగా మొరాయింపు...

ప్రాజెక్టు మధ్యకాలువ షట్టర్‌కు 15 ఏళ్ల క్రితం చిన్న రంధ్రం ఏర్పడింది. అది కాస్తా ఏటా పెరిగిపోయి షటర్ పైకెత్తడానికి ఉపయోగించే ఇనుపరాడ్ వరకు చేరింది. దీంతో షటర్ పైకి లేపడానికి ఉపయోగపడే రాడ్‌కు అమర్చిన పట్టీ విరిగిపోయి షటర్ ఒకవైపు వంగిపోయింది. ఈఏడాది ఆయకట్టుకు సాగునీరందడం కష్టంగా మారింది. మధ్యకాలువ పొడవు మొత్తం 32 కిలో మీటర్లు కాగా కాలువ ఆయకట్టు 5,945 ఎకరాలు ఉంటుంది. దీంతో అధికారులు మధ్యకాలువ షటర్‌కు మరమ్మతులు చేపట్టాలని ఏటా ప్రతిపాదనలు పంపుతున్నారు. ఈఏడాది ప్రభుత్వం రూ.5 లక్షలు విడుదల చేసింది. దీంతో పనులు వేగంగా చేస్తున్నారు. పనులు త్వరగా పూర్తిచేసి ఖరీఫ్‌కు సాగునీరందిస్తామని ప్రాజెక్టు జేఈ మధుపాల్ తెలిపారు.



స్వర్ణ ప్రాజెక్టు మధ్యకాలువ(జౌళినాలా)

బ్యారేజీకి బడ్జెట్ కొరత..

మామడ: మండలంలోని పొన్కల్ వద్ద గోదావరి నదిపై సదర్మాట్ బ్యారేజీ నిర్మాణం కొనసాగుతుంది. 2016, అక్టోబర్ 25న ఈ బ్యారేజీ పనులు ప్రారంభించారు. రూ.528 కోట్లు కేటాయించారు. బ్యారేజి నీటి నిల్వ సామర్థ్యం 1.58 టీఎంసీలు, 18 వేల ఎకరాలకు సాగు నీరు అందించేలా డిజైన్ చేశారు. నిధుల విడుదలలో జాప్యం, గోదావరిలో వరదల కారణంగా నిర్మాణం నత్తనడకన సాగింది. ప్రస్తుతం బ్యారేజీ నిర్మాణ పనులు చివరి దశలో ఉన్నాయి. సీసీ పనులు పూర్తి చేసుకుని 55 గేట్లు బిగించాల్సి ఉంది. ఈ ఏడాది జూలై వరకు గేట్లు బిగించి నీటిని నిల్వ చేస్తామని నీటిపారుదల శాఖ ఈఈ రామారావు తెలిపారు.

'గడ్డెన్న' గేట్లకు మరమ్మతు



గడ్డెన్నవాగు ప్రాజెక్టు

భైంసాటౌన్: భైంసాలోని గడ్డెన్నవాగు ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1.82 టీఎంసీలు, మొత్తం ఎనిమిది గేట్లు ఉన్నాయి. ఏటా వానాకాలంలో అధిక వర్షాలకు ఎగువ నుంచి వరదలు వచ్చినప్పుడు ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టాన్ని కొనసాగిస్తూ నీటిని దిగువకు వదలుతుంటారు. అయితే ఇప్పటి వరకు ఆరు గేట్లు మాత్రమే ఎత్తారు. ఎనిమిది గేట్లు ఎత్తిన సందర్భం రాలేదని ప్రాజెక్టు అధికారులు పేర్కొన్నారు. ఏటా ప్రాజెక్టు గేట్లు, ఇతర నిర్వహణ పనులు చేపడుతున్నామని, వరదలు వచ్చినప్పుడు ప్రాజెక్టు గేట్లు పూర్తిస్థాయిలో పనిచేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు డీఈఈ అనిల్ తెలిపారు.

అర్జీలు సత్వరం పరిష్కరించాలి

- కలెక్టర్ వరుణ్‌రెడ్డి
- కలెక్టరేట్‌లో ప్రజావాణి



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్

నిర్మల్‌చైన్‌గేట్: ప్రజావాణిలో ప్రజల నుంచి వచ్చిన అర్జీలను పరిశీలించి సత్వరం పరిష్కరించాలని కలెక్టర్ వరుణ్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వివిధ సమస్యలపై 31 దరఖాస్తులు వచ్చాయి. తమ వార్డులో డ్రైనేజీలు లేకపోవడంతో మురుగునీరు ఇళ్లమధ్యే నిలిచి ఉంటోందని, డ్రైనేజీలు నిర్మించాలని భైంసా పట్టణంలోని ఏడోవార్డుకు చెందిన శ్రీనివాస్ విన్నవించాడు. పార్డీ(బి) శివారులో సర్వేనంబర్ 313/6లో ఉన్న తమ భూమిని ఇతరులు అక్రమంగా పట్టా చేయించుకున్నారని, తమకు న్యాయం చేయాలని కుబీర్ మండలం మాడేగాంకు చెందిన పోశెట్టి వేడుకున్నాడు. పార్డీ(బి) శివారు సర్వేనంబర్ 314/ఉ లో ఉన్న రెండెకరాల భూమిని ధరణిలో నమోదు చేయాలని కుబీర్‌కు చెందిన జరిభోజన్న దరఖాస్తు అందజేశాడు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ రాంబాబు, ఆర్డీవోలు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలన



ధాన్యం పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

మామడ/సోన్: మామడ మండలంలోని పొన్కల్, సోన్ మండలంలోని పీఏసీఎస్, న్యూవెల్మల్ ఎఫ్ఎస్‌సీఎస్ వరిధాన్యం కొ నుగోలు కేంద్రాలను సోమవారం అదనపు కలెక్టర్ రాంబాబు పరిశీలించారు. ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని నిర్వాహకులకు సూచించారు. రైతులకు ఇబ్బందులు లేకుండా కొనుగోళ్లు నిర్వహించాలన్నారు.

ప్రతి ఒక్కరికీ పోలీస్ రక్షణ


- ఎస్పీ ప్రవీణ్ కుమార్



అర్జీదారు సమస్య తెలుసుకుంటున్న ఎస్పీ

నిర్మల్‌టౌన్: జిల్లాలోని ప్రతి ఒక్కరికీ పోలీస్ రక్షణ ఉంటుందని ఎస్పీ ప్రవీణ్ కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పోలీస్ కార్యాలయంలో సోమవారం గ్రీవెన్స్ నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. సంబంధిత పోలీస్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. పోలీసుల సహాయం కావాలనుకునే వారు నిర్భయంగా ఠాణాలో ఫిర్యాదు చేయాలని, అనుమానాస్పదంగా వ్యక్తులు కనిపిస్తే వెంటనే 8712659599 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు.

వడగళ్లు... కడగండ్లు



జామ్ కొనుగోలు కేంద్రంలో తడిసిన ధాన్యం బస్తాలు

సారంగపూర్(నిర్మల్): మండలంలో ఆదివారం రాత్రి కురిసిన వడగళ్ల వాన రైతులకు కడగండ్లే మిగిల్చింది. ఒక్కసారిగా భారీ ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షానికి జనజీవనం అతలాకుతలమైంది. జామ్, యాకర్‌పెల్లి, ఆలూరు, ధని, సారంగాపూర్, బోరిగాం గ్రామాల్లో దాదాపు 150 ఎకరాల్లో వరిపంట నేలవాలింది. కొనుగోలు కేంద్రాల్లో విక్రయానికి సిద్ధంగా ఉంచిన వరి, మొక్కజొన్న పంటలు తడిసిముద్దయ్యాయి. జామ్‌లో రెండు 33 కేవీ విద్యుత్ స్తంభాలు, బోరిగాంలో భారీ వృక్షం విరిగిపడ్డాయి. ఆలూరులో రెండిళ్లు, బీరవెల్లిలో 1, ధనిలో ఇంటి పైకప్పులు ఎగిరిపోయాయి. ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.



సాయినగర్ సమీపంలో నేలరాలిన వరిధాన్యం



జామ్‌లో విరిగిపడ్డ స్తంభం



బోరిగాంలో నేలకొరిగిన భారీ వృక్షం

వీవోఏల కలెక్టరేట్ ముట్టడి



కలెక్టర్ కార్యాలయం ఎదుట బైఠాయించిన వీవోఏలు

నిర్మల్‌చైన్‌గేట్: తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఐకేపీ వీవోఏలు సోమవారం కలెక్టరేట్ ముట్టడికి యత్నించారు. కలెక్టర్ బయటకు రావాలని నినాదాలు చేయడంతో కలెక్టర్ బయటికి వచ్చి వారి సమస్యలు విన్నారు. వినతిపత్రాలు తీసుకుని ప్రభుత్వానికి నివేదిస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేశ్ మాట్లాడుతూ 34 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడంతో కలెక్టరేట్ ముట్టడికి యత్నించామన్నారు. వీవోఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనం రూ. 26వేలు ఇవ్వాలని, రూ.10 లక్షల ప్రమాద బీమా, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. జిల్లా ఉపాధ్యక్షుడు ప్రభాకర్, కోశాధికారి స్వప్న, రాజు, మహేష్, సంపత్, పరమేశ్, లావణ్య, రవీందర్, జీవన్, సునీత, లావణ్య పాల్గొన్నారు.

క్రీడలకు అధిక ప్రాధాన్యం

- మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి

నిర్మల్‌టౌన్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు అధిక ప్రాధాన్యత ఇస్తుందని మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో జిల్లాస్థాయి సీఎం కప్ క్రీడా పోటీలను కలెక్టర్ వరుణ్ రెడ్డి, ఎస్పీ సీహెచ్ ప్రవీణ్‌కుమార్‌తో కలిసి ప్రారంభించారు. క్రీడాకారులతో కలిసి కబడ్డీ ఆడి వారిలో ఉత్సాహం నింపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఈ నెల 31 వరకు మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో వివిధ క్రీడాపోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాంబాబు, ఆర్డీవో స్రవంతి, మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్, జిల్లా యువజన, క్రీడల అభివృద్ధి అధికారి క్రాంతి కుమార్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ ఎర్రవోతు రాజేందర్, డీఈవో రవీందర్‌రెడ్డి, డీఎస్పీ జీవన్ రెడ్డి పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

నిర్మల్‌టౌన్: ఆలయాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని మంత్రి ఐకేరెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని సోఫీనగర్‌లో విశ్వకర్మ ఉద్యోగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన శ్రీ మద్విరాట్ విశ్వకర్మ భగవాన్ విగ్రహ ప్రతిష్టాపనకు హాజరయ్యారు. కార్యక్రమంలో రాష్ట్ర విశ్వకర్మ ప్రచార కార్యదర్శి లక్ష్మణచారి, ఆకోజి కిషన్, తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి కృషి

మామడ: బీఆర్ఎస్ ప్రభుత్వం ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తోందని మంత్రి ఐకేరెడ్డి అన్నారు. మండలంలోని కప్పన్‌పల్లిలో రూ.10లక్షల నిధులతో నిర్మించిన ఆంజనేయస్వామి ఆలయం, కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభించారు. జెడ్పీచైర్‌పర్సన్ కొరిపెల్లి విజయలక్ష్మి రాంకిషన్‌రెడ్డి, సర్పంచ్ లక్ష్మి, నాయకులు భూషన్‌రెడ్డి, లింగారెడ్డి, గంగారెడ్డి, చంద్రశేఖర్ గౌడ్, సాయిరాంరెడ్డి, బాపు, శశికాంత్‌రెడ్డి, వికాస్ రెడ్డి, లింగారెడ్డి, రాందాస్, అలీం పాల్గొన్నారు.

పేదలకు పక్కా ఇళ్ల నిర్మాణానికి కృషి

ఖానాపూర్: పేదలకు పక్కా ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి అన్నారు. అడవి సారంగాపూర్ పంచాయతీ పరిధిలోని రాజులమడుగులో ఐటీడీఏ ఆధ్వర్యంలో రూ.3 లక్షలతో నిర్మించిన 15 పక్కా ఇళ్లను ఎమ్మెల్యే అజ్మీరా రేఖానాయక్, కలెక్టర్ వరుణ్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ మోహిద్, సర్పంచ్ మడావి జంగుబాయి, నాయకులు రాంకిషన్‌రెడ్డి, పుప్పాల శంకర్, రాము నాయక్, అంకం రాజేందర్, తదితరులు ఉన్నారు.



క్రీడాకారులతో కలిసి కబడ్డీ ఆడుతున్న మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి

క్లుప్తంగా

బీఆర్‌ఎస్‌లో చేరిక



సీఎం కేసీఆర్‌కు అన్నబాహుసాఠే చిత్రపటాన్ని అందజేస్తున్న నాయకులు

కుంటాల: మహారాష్ట్ర అన్నాబాహుసాఠే నాయకులు సోమవారం హైదరాబాద్‌లోని ప్రగతి భవన్‌లో సీఎం కేసీఆర్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. కేసీఆర్‌కు ఈ సందర్భంగా వారు అన్నబాహు సాఠే చిత్రపటాన్ని అందజేశారు. ఆదిలాబాద్ అన్నబాహుసాఠే అధ్యక్షుడు ఉద్ధవ్ కాంబ్లే, నిర్మల్ జిల్లా అధ్యక్షుడు ఉత్తం బాలేరావు, బీఆర్‌ఎస్ సోషల్‌మీడియా, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పెంటావార్ దశరథ్, పార్టీ ఎస్సీ సెల్ ప్రెసిడెంట్ గాడేకర్ రమేశ్, నాయకులు సాయినాథ్ గాయక్‌వాడ్, బీఎస్‌ఎస్ న్యూస్ డైరెక్టర్ శంకర్ ఉన్నారు.

పది మంది వీవోఏలపై కేసు

ఆదిలాబాద్‌టౌన్: ఉద్యోగ భద్రతను కల్పించాలనే డిమాండ్ చేస్తూ కలెక్టరేట్‌ను ముట్టడించిన పది మంది వీవోఏలపై టూటౌన్ ఎస్సై ఊశన్న కేసు నమోదు చేశారు. సోమవారం ఉదయం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేయడంతోపాటు రోడ్డుపై బైఠాయించి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించారు. అక్కడికి చేరుకున్న ఎస్సై వారికి నచ్చజెప్పిన వినకపోవడంతో కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్



పేకాట ముక్కలు, నగదు

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని టూటౌన్ పరిధిలో నలుగురు పేకాటరాయుళ్లను అరెస్టు చేసినట్లు సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ చంద్రమౌళి తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. ఇంద్రానగర్ భీంసరి శ్మశానవాటిక ప్రాంతంలో సోమవారం సాయంత్రం పేకాట ఆడుతుండగా దాడులు జరిపి నలుగురిని పట్టుకుని, వారి వద్ద నుంచి రూ.3,020 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వీరిపై టూటౌన్‌పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

లైంగికదాడి కేసులో ఒకరికి 20 ఏళ్ల జైలు

ఆదిలాబాద్‌టౌన్:మైనర్ బాలికపై లైంగికదాడి చేసిన కేసులో ఒకరికి 20 ఏళ్ల జైలు శిక్షతో పాటు రూ.4వేల జరిమానా విధిస్తూ పోక్సో కోర్టు ఇన్‌చార్జి జడ్జి డాక్టర్ శివరాంప్రసాద్ సోమవారం తీర్పునిచ్చినట్లు లైజన్ అధికారి పండరి తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. జైనథ్ మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఎనిమిదేళ్ల బాలిక తన స్నేహితులతో ఆడుకుంటుంది. ఆ సమయంలో నిరాల గ్రామానికి చెందిన బోయర్ ఆకాశ్ ఆ బాలికకు మొబైల్ ఫోన్ చూపిస్తూ తన ఇంటికి తీసుకెళ్లాడు. ఆమె స్నేహితులను బయటికి పంపించి లైంగికదాడికి పాల్పడ్డాడు. బాలిక తన తల్లికి ఈ విషయాన్ని తెలియజేయడంతో జైనథ్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అప్పటి ఎస్సై వై.రామయ్య కేసు నమోదు చేశారు. ప్రత్యేక పీపీ రమణారెడ్డి 14 మంది సాక్షులను ప్రవేశపెట్టి నేరం రుజువుతో జడ్జి తీర్పునిచ్చారు.

క్రీడల్లో మెరిసేలా..

- గిరి విద్యార్థులకు శిక్షణ
- ఐటీడీఏ ఆధ్వర్యంలో వేసవి క్రీడాశిక్షణ శిబిరాలు
- సమగ్రాభివృద్ధి ధ్యేయంగా ప్రత్యేక దృష్టి

గిరిజన గూడేల్లో నివసించే గిరి విద్యార్థులు జాతీయ, రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో ప్రతిభ కనబర్చేలా ఐటీడీఏ ఆధ్వర్యంలో వేసవి క్రీడాశిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నారు. జిల్లాకేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియం, కొలాం ఆశ్రమ ఉన్నత పాఠశాలల్లో కొనసాగుతున్న ఈ శిబిరాల్లో ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల్లోని ఐటీడీఏ పరిధిలోని ఆశ్రమ పాఠశాలలు, రెండు గిరి క్రీడా పాఠశాలల విద్యార్థులు శిక్షణ పొందుతున్నారు. పలు క్రీడాంశాల్లో తర్ఫీదు ఇస్తుండడం, విద్యార్థుల సమగ్రాభివృద్ధికి అవసరమైన అన్ని అంశాల మేళవింపుతో శిబిరాల్లో ట్రెనింగ్ ఇస్తున్నారు.

– ఆదిలాబాద్

ఏడు క్రీడాంశాలు..20 రోజులు

బాక్సింగ్, స్విమ్మింగ్, జూడో, హాకీ, ఆర్చరీ, ఫుట్‌బాల్, అథ్లెటిక్స్.. ఏడు క్రీడాంశాల్లో శిక్షణ ఇస్తున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రతీ అంశంలో ఒక్కో శిక్షకుని ద్వారా వారికి మెలకువలు నేర్పుతున్నారు. ఆర్చరీని ఆదిలాబాద్ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో, ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో స్విమ్మింగ్, బాక్సింగ్, జూడో, అథ్లెటిక్స్, ఫుట్‌బాల్, హాకీ క్రీడల్లో శిక్షణ కొనసాగుతోంది. మొత్తం 135 మంది క్యాంప్‌లో ఉండగా 60 మంది బాలికలు, 75 మంది బాలురులు ఉన్నారు. ఆదిలాబాద్, చించుఘాట్, సైద్‌పూర్, ఉట్నూర్, జాతర్ల గిరి క్రీడ పాఠశాలల విద్యార్థులకు 20 రోజులు ఈ శిక్షణ అందజేసేలా ప్రణాళిక బద్ధంగా ముందుకెళ్తున్నారు.

సర్వతోముఖాభివృద్ధి లక్ష్యంగా..

గిరి విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధి లక్ష్యంగా శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఆరోగ్యం పెంపొందించేలా వివిధ అంశాలను వారికి తెలుపుతున్నారు. కెరీర్ గైడెన్స్, డయల్ 100, 1098, సైబర్ నేరాలు, మోటివేషనల్ తరగతులు, సాహిత్య అంశాలపై అవగాహన కల్పించడం, మూఢనమ్మకాలపై భయాన్ని పోగొట్టేలా కార్యక్రమాలు చేపట్టారు. క్రీడల్లో ఉన్నత స్థానానికి ఎదిగిన గొప్ప క్రీడాకారుల జీవిత చరిత్రను ప్రతి ఆదివారం చిత్ర మాధ్యమం ద్వారా వీక్షించేలా ఏర్పాట్లు చేస్తున్నారు.



ఆర్చరీ అభ్యసిస్తున్న విద్యార్థులు

పతకాలే లక్ష్యంగా..



గిరి క్రీడాకారుల్లో ప్రతిభ ను వెలికి తీయాలనే ఉద్దేశంతో వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు ఏర్పాటు చే శాం. క్రీడాకారులతో పాటు విద్యార్థులకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నాం. ఇంటర్ సొసైటీస్ లీగ్ రాష్ట్ర గిరిజన క్రీడోత్సవాల్లో గతంలో ఐటీడీఏ పరిధిలోని విద్యార్థులు రాష్ట్రస్థాయిలో ద్వితీయస్థానంలో నిలిచారు. ఈసారి ప్రథమ స్థానం, జాతీయ స్థాయి గిరి క్రీడా పోటీల్లో పతకాలు సాధించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం.

– పార్థసారథి, జిల్లా గిరిజన క్రీడల అధికారి

ఆటల్లో ఆసక్తి



గిరి విద్యార్థుల్లో ఆటలపై ఆసక్తి ఉంది. వారిపై ప్రత్యేక దృష్టి సారించాం. ఈ సమ్మర్ క్యాంపు వారికి ఎంతగానో ఉపయోగం. రాష్ట్ర జాతీయ స్థాయి పోటీల్లో సాధించిన విద్యార్థులు స్నేహభావంతో మెలుగుతూ ఎన్నో కొత్త విషయాలు నేర్చుకునేలా శిక్షణ ఇస్తున్నాం. వారికి ప్రత్యేక మెనూ ద్వారా ఆహారం అందిస్తున్నాం.

– రాము, అథ్లెటిక్స్ కోచ్

పంచ్‌లు వేయాలి



బాక్సింగ్ నేర్చుకోవాలంటే ప్రత్యర్థికి భయపడకూడదు. ధైర్యంగా పంచులు కురిపించాలి. అప్పుడే విజయం సాధించవచ్చని అర్థం చేసుకున్నా. సీనియర్ క్రీడాకారులు సలహా ఉపయోగపడుతాయి. అవకాశం కల్పిస్తే ఈ క్రీడల్లో రాణిస్తాననే నమ్మకం ఉంది.

– ఎం.సంధ్య, ఆశ్రమ పాఠశాల, చించుఘాట్

పతకాలు సాధిస్తా



నేను రన్నింగ్‌లో 100, 200 మీటర్ల పోటీల్లో జాతీయ స్థాయికి ప్రాతినిధ్యం వహించా. పాట్నా, అస్సాంలో జరిగిన పోటీల్లో 7వ స్థానం సాధించా. ఆటల్లో పొరపాట్లను సరిదిద్దుకోవడానికి ఈ క్యాంప్ ఎంతగానో దోహదం చేస్తుంది. కోచ్ మెలకువలు నేర్పుతున్నారు. త్వరలో జరిగే సీఎం కప్ క్రీడా పోటీల్లో పతకాలు సాధిస్తా.

– మడావి సోము, జాతర్ల గిరి క్రీడ పాఠశాల

స్విమ్మింగ్‌లో రాణిస్తా



వేసవి శిక్షణ శిబిరంలో స్విమ్మింగ్ ఎంచుకున్నా. ప్రత్యేక శ్రద్ధతో శిక్షణ కల్పిస్తున్నారు. బటర్‌ఫ్లై, బ్యాక్‌స్ట్రోక్, ఫ్రీస్టైల్ అంశాలు ఉంటాయని తెలుసుకున్నా. హాకీతో పాటు స్విమ్మింగ్‌లో కూడా రాణించాలని అనుకుంటున్నాను. మొదటిసారి అయినా ఎలాంటి బెరుకు లేకుండా తర్ఫీదు నిస్తున్నారు.

– వంశీకృష్ణ, ఆశ్రమ పాఠశాల, ఆదిలాబాద్

జాతీయస్థాయి లక్ష్యంగా..



ఆర్చరీలో గతేడాది డిసెంబర్‌లో ఏటూరునగరంలో జరిగిన ట్రైబల్ స్టేట్ స్పోర్ట్స్ మీట్‌లో ఆడాను. పోటీల్లో 30 మీటర్ల ఈవెంట్‌లో బంగారు పతకం సాధించా. ప్రస్తుతం శిక్షణ తీసుకుంటున్నా. 40 మీటర్ల లక్ష్యంగా పెట్టుకున్నా. సైట్, ఆరో రిలీజింగ్‌తోపాటు కోచ్ నేర్పిస్తున్న కొత్త టెక్నిక్స్‌పై శ్రద్ధ కనబర్చుతున్నా. జాతీయ స్థాయిలో సత్తా చాటేలా లక్ష్యం పెట్టుకున్నా.

– ఎస్.శ్రీజ, ఆశ్రమ పాఠశాల, చించుఘాట్

మరిన్ని పతకాలు తెస్తా..



జావెలిన్ త్రో క్రీడల్లో ఇప్పటికే రాష్ట్ర స్థాయి పోటీల్లో పతకాలు సాధించా. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో గోల్డ్ మెడల్ కైవసం చేసుకున్నా. షాట్ ఫుట్ ఈవెంట్లో సిల్వర్ మెడల్ వచ్చింది. ఈ క్యాంపుతో తరచూ క్రీడ సాధన చేస్తున్నా. జాతీయస్థాయి పోటీల్లో మరిన్ని పతకాలు సాధిస్తాను.

– శ్రీకాంత్, జాతర్ల గిరి క్రీడా పాఠశాల

ఆర్చరీ ఎంచుకున్నా..



ఆశ్రమ పాఠశాలలో కబడ్డీ, ఖోఖో, క్రికెట్ పోటీలు ఆడాను. వేసవి శిబిరంలో ఆర్చరీ క్రీడను ఎంచుకుని శిక్షణ తీసుకుంటున్నా. దీనికి సంబంధించి కోచ్ ప్రత్యేకంగా వివరిస్తున్నారు. దీంతో ఉత్సాహంగా నేర్చుకుంటున్నాను.

– నాగోరావు, ఆశ్రమ పాఠశాల, సైద్‌పూర్

భవిష్యత్తులోనూ..



మేము ఆశ్రమ పాఠశాలల్లో విద్యాభ్యాసం చేస్తున్నాం. అవగాహన లేక జూడో నేర్చుకోవడంలో తడబడ్డాం. కోచ్ ప్రతీ అంశాన్ని అర్థమయ్యే రీతిలో చెప్పడంతో సులభంగా నేర్చుకునే అవకాశం కలుగుతోంది. భవిష్యత్తులో ఈ క్రీడను ఆడాలని అనుకుంటున్నాం.

– జంగుబాయి, దేవుబాయి, భాగ్యజ్యోతి, సరోజ

కొత్త టెక్నిక్స్ నేర్చుకున్నాం



మేము క్రీడా పాఠశాల విద్యార్థులమే. ఈ క్యాంప్‌లో సీనియర్ క్రీడాకారుల మధ్య హాకీ క్రీడను అభ్యసించే అవకాశం లభించింది. కొత్త టెక్నిక్స్ నేర్చుకున్నాం. ఆటల్లో సైతం వేగం పెరిగింది. ఉత్సాహంగా క్యాంప్ సాగుతుంది.

– జాదవ్ యువరాజ్, జాదవ్ చరణ్, స్పోర్ట్స్ స్కూల్, ఉట్నూర్

సెల్‌ఫోన్ పోతే ఆందోళన వద్దు



బాధితులకు సెల్‌ఫోన్ అప్పగిస్తున్న ఎస్పీ ప్రవీణ్‌కుమార్

- ఎస్పీ ప్రవీణ్‌కుమార్

నిర్మల్‌టౌన్: ఎవరైన సెల్‌ఫోన్ పోగొట్టుకుంటే ఆందోళన చెందవద్దని ఎస్పీ ప్రవీణ్‌కుమార్ పేర్కొన్నారు. 20 పోలీస్ స్టేషన్ల పరిధిలో 51 మంది ఫోన్లు పోగొట్టుకోగా, సీఈఐఆర్ వెబ్‌సైట్ ద్వారా పోలీసులు గుర్తించారు. జిల్లాకేంద్రంలోని తన కార్యాలయంలో ఎస్పీ ప్రవీణ్‌కుమార్‌తో సోమవారం 15 మందికి తిరిగి సెల్‌ఫోన్లు అందజేశారు. మిగతా 36 సెల్‌ఫోన్లను వివిధ పోలీస్‌స్టేషన్లలో అప్పగించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ ఎవరైనా ఫోన్ పోగొట్టుకుంటే సంబంధిత పోలీస్‌స్టేషన్‌లో లేదా మీసేవ ద్వారా ఫిర్యాదు చేయాలని సూచించారు. మొదట అదే నెంబర్‌తో కొత్త సిమ్ తీసుకుని, https:// www. ceir. gov. in/ వెబ్‌సైట్ ఓపెన్ చేసి ఫోన్ ఐఎంఈఐ నంబర్ అప్‌లోడ్ చేసి, రిక్వెస్ట్ ఫర్ బ్లాకింగ్ అని నమోదు చేసుకోవాలన్నారు. తర్వాత పోలీస్‌స్టేషన్‌లో సమాచారం అందించాలని తెలిపారు. పోగొట్టుకున్న ఫోన్లను తిరిగి అందజేయడంలో కృషిచేసిన ఐటీ కోర్ విభాగం సిబ్బందిని అభినందించారు. ఎస్పీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, ఐటీ కోర్ ఇన్‌చార్జి రవికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

చికిత్సపొందుతూ ఒకరి మృతి

ఆదిలాబాద్‌రూరల్: పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన మండలంలోని తిప్ప పంచాయతీ పరిధిలోని బోరింగ్‌గూడకు చెందిన కొడప కానీరాం (46) చికిత్సపొందుతూ మృతి చెందాడు. ఎస్సై నాగనాథ్ కథనం ప్రకారం.. కానీరాం మద్యానికి బానిసయ్యాడు. ఈనెల 20న మద్యం తాగి ఇంటికి వెళ్లాడు. ఐదుగురు పిల్లలున్నారు.. రోజు తాగి రావడం ఏంటని భార్య కన్నీబాయి మందలించింది. మనస్తాపం చెందిన కానీరాం శనివారం రాత్రి పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు ఆయన్ను రిమ్స్‌కు తరలించగా, చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. భార్య కన్నీబాయి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పాముకాటుకు వ్యక్తి మృతి

ఆదిలాబాద్‌టౌన్: మహారాష్ట్రలోని యావత్మాల్ జిల్లా ధమడ్‌దేవి గ్రామానికి చెందిన కినాకే రతన్ (55) పాముకాటుతో సోమవారం మృతిచెందాడు. టూటౌన్ హెడ్‌కానిస్టేబుల్ మదన్ కథనం ప్రకారం.. ఉదయం 10గంటల ప్రాంతంలో ఎడ్లకొట్టంలో పశుగ్రాసం వేయడానికి వెళ్లిన రతన్ కాలికి పాము కాటేసింది. కుటుంబీకులు హుటాహుటిన పాటన్‌బోరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమించడంతో అక్కడి నుంచి రిమ్స్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చెరువులో పడి దివ్యాంగ బాలుడి మృతి



వాకుడే నవ్‌నాథ్ మృతదేహం

నర్సాపూర్(జి): చెరువులో పడి దివ్యాంగ బాలుడి మృతిచెందిన ఘటన మండలంలోని కుస్లీ గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా తలియచివాడి గ్రామానికి చెందిన రాందాస్ కుటుంబం ఆరేళ్ల క్రితం బతుకుదెరువు కోసం నర్సాపూర్(జి) మండలం కుస్లీ గ్రామానికి వచ్చారు. కూలీ పనులు చేస్తూ జీవిస్తున్నారు. వీరికి ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారు. చిన్న కుమారుడు వాకుడే నవ్‌నాథ్ (15) పుట్టుకతో అంగవైకల్యం ఉంది. నవ్‌నాథ్ ఆదివారం మధ్యాహ్నం ఇంట్లో నుంచి బయటకు వెళ్లి తిరిగి రాకపోవడంతో చుట్టుపక్కల వెతికినా కనిపించలేదు. సోమవారం ఉదయం గ్రామానికి చెందిన ఒకరు కాలకృత్యాల కోసం ఎల్లమ్మ చెరువు వైపు వెళ్లగా చెరువులో బాలుడి శవం కనిపించింది. గ్రామస్తులకు సమాచారం అందించాడు. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు వెళ్లి చూడగా నవ్‌నాథ్‌గా గుర్తించారు. పోస్టుమార్టం నిమిత్తం పోలీసులు భైంసా ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతుడి తండ్రి రాందాస్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై మాన్‌సింగ్ తెలిపారు.

అర్జీలు సత్వరం పరిష్కరించాలి

- డీడీ దిలీప్‌కుమార్



అర్జీలు స్వీకరిస్తున్న డీడీ దిలీప్‌కుమార్

ఉట్నూర్‌రూరల్: గిరిజన అర్జీలు సత్వరం పరిష్కరించాలని డీడీ డా.దిలీప్‌కుమార్ అన్నారు. ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ఆయన గిరిజనుల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాఖల అధికారుల అర్జీలను పరిశీలించి గిరిజనులకు వెంటనే న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీవో పీవీటీజీ ఆత్రం భాస్కర్, ఏవో రాంబాబు, జేడీఎం నాగభూషణ్, బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్ మనోహర్, డీపీవో ప్రవీణ్, ఐటీడీఏ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

- స్వయం ఉపాధికి ఆర్థికసాయం మంజూరు చేయాలని ఆసిఫాబాద్ మండలం మలన్‌గోంది గ్రామానికి చెందిన కె.సోము అర్జీ సమర్పించాడు. ఝరి గ్రామానికి చెందిన చంద్రకళ తన కుమార్తెకు గురుకులంలో సీటు ఇప్పించాలని దరఖాస్తు చేసింది.
- ఆశ్రమ పాఠశాలలో సీటు ఇప్పించాలని ఇంద్రవెల్లి మండలం మామిడిగూడ గ్రామానికి చెందిన మంజులత విన్నవించింది.
- తన పేరిట భూమి పట్టా మంజూరు చేయాలని ఇంద్రవెల్లి మండలం హర్కపూర్ గ్రామానికి చెందిన మెస్రం గిరిజాబాయి కోరింది.

దాడి చేసిన ఇద్దరిపై కేసు

ఆదిలాబాద్‌రూరల్: ఆదిలాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రణదీవేనగర్‌కు చెందిన బోయర్ లక్ష్మణ్‌పై దాడి చేసి గాయపర్చిన ఇద్దరు అన్నదమ్ముళ్లపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై నాగనాథ్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం..బోయర్ లక్ష్మణ్ ఈనెల 17న కౌన్సిలర్ ఇంటికి వెళ్తున్న క్రమంలో అదే కాలనీకి చెందిన నైతం పరమేశ్వర్ మద్యం తాగి ఆయనతో గొడవపడి దాడి చేశాడు. అంతలో పరమేశ్వర్ సోదరుడు వికాస్ మా అన్నయ్యతో గొడవకు దిగిన లక్ష్మణ్‌పై దాడి చేయడంతో కిందపడ్డాడు. కుటుంబ సభ్యులు లక్ష్మణ్‌ను ఆసుపత్రికి తరలించారు. బాధితుడు ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

మరో ఇద్దరిపై..

మావల పోలీస్‌స్టేషన్ పరిధిలోని వాఘాపూర్‌లో నైతం రామి, కుమారుడిపై దాడి చేసిన అదే గ్రామానికి చెందిన ఆత్రం నాందేవ్‌పై సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. ఆత్రం నాందేవ్ వారి ఇంటికి అనుకొని ఉన్న నైతం కవిత భర్త రామి, కుమారుడిపై మద్యం తాగి దాడి చేశారు. కవిత ఫిర్యాదు మేరకు నాందేవ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపన



పూజలో పాల్గొన్న రాథోడ్ జనార్దన్, కుమ్ర ఈశ్వరిబాయి

ఇంద్రవెల్లి: మండలంలోని దోడందా గ్రామంలో కొత్తగా నిర్మించిన జగదాంబ, సేవాలాల్ మహారాజ్ ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. శేఖర్ మహారాజ్, రాంసింగ్‌బాబా ఆధ్వర్యంలో పూజలు చేశారు. జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్, రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు కుమ్ర ఈశ్వరిబాయిలు హాజరై పూజల్లో పాల్గొన్నారు. అనంతరం వారిని గ్రామ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ భక్తిమార్గంలో పయనించాలన్నారు. ప్రేమ్‌సింగ్ మహారాజ్, నాయకుడు మర్సుకోల తిరుపతి, ఎంపీటీసీ స్వర్ణలత, గ్రామపెద్దలు పవార్ దూదిరాం తదితరులు ఉన్నారు.



ప్రతిష్ఠించిన జగదాంబ దేవి విగ్రహం

నాసిరకం విత్తనాలు, ఎరువులు అమ్మితే చర్యలు

తాండూర్: రైతులకు నకిలీ, నాసిరకం విత్తనాలు, ఎరువులను విక్రయిస్తే దుకాణ యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామని మంచిర్యాల డీసీపీ సుధీర్ రాంనాథ్ కేకన్ హెచ్చరించారు. సోమవారం తాండూర్‌లోని బాలాజీ ఫర్టిలైజర్స్ షాపులో తనిఖీ చేశారు. గోదాంలో నిల్వ ఉన్న విత్తనాలు పరిశీలించారు. స్టాక్, అమ్మకం వివరాలు, రిజిష్టర్, బిల్లుల వివరాలు తెలుసుకున్నారు. డీసీపీ మాట్లాడుతూ విత్తనాలు, ఎరువుల విక్రయానికి సంబంధించి విధిగా రశీదులు ఇవ్వాలని ఆదేశించారు. సీఐలు జగదీష్, రాజ్‌కుమార్‌గౌడ్, మహేందర్‌రెడ్డి, మంచిర్యాల టాస్క్‌ఫోర్స్ సీఐ అశోక్‌కుమార్ పాల్గొన్నారు.